సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
17వ
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
ఆదివారం,26 మే 2024


# చిన్నతనం నుండి క్రమశిక్షణ నేర్పించాలి - సివిల్ జడ్జి గంగరాజు




**నర్సాపురం,మేజర్ న్యూస్:** చిన్న పిల్లలకు ఇప్పటినుండే క్రమశిక్షణ, విద్యాబుద్ధులను తల్లితండ్రులు నేర్పించాలని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గంగరాజు కోరారు. శనివారం అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోయేషన్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు అధ్యక్షతన డ్వాక్రా మహిళలకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గంగ రాజు పాల్గొని మాట్లాడుతూ 1983 లో ప్రారంభమైన ఈ ప్రత్యేక దినాన్ని ప్రతి సంవత్సరం మే 25న జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సారం దాదాపు 96 వేలమంది పిల్లలు అపహరణకు గురవుతున్నారని,అందుకే పిల్లలను రక్షించడానికి రక్షణచట్టంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉన్నత న్యాయస్థానాలు ప్రత్యేక దృష్టి సారించాయి అన్నారు.
బాలికలను అపహరించి, అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారని చిన్నతనం నుండి పిల్లలకు మంచి,చెడు నేర్పించాలని గంగరాజు అన్నారు. ఒంటరిగా ఎవరైనా పిల్లలు అనుమానాస్పదంగా కనిపిస్తే 1098కి కాల్ చేస్తే శిశు గృహ డిపార్ట్మెంట్ వారు వారికి వసతి కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, చల్లా దానయ్య నాయుడు, జనరల్ సెక్రెటరీ ఆర్.జి.కుమార్,చిట్టి పద్మజ,కార్యవర్గ సభ్యులు,ప్యానల్ లాయర్ లు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ఏకపక్షమా?




**ఏలూరు,సూర్యబ్యూరో:** రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులందరుప్రభుత్వంపైతీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారని, అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా,కసిగాఓట్లువేశారనేవాదనవినిపి స్తోంది. ప్రభుత్వంతప్పఇవ్వాల్సినబకాయిలు, రాయితీలు, తమ జీవితంలో దాచుకున్నడబ్బుకూడా తీసుకో లేని పరిస్థితి,సిపిఎస్ అమలు చేయలేకపోవడం, పెన్షనర్ల సమస్యలు ఇంకాఎన్నెన్నోసమస్యలకు కారణమైందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉపాధ్యాయులుకూడా ప్రభుత్వాన్నితీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అంటున్నారు.

సహజంగా అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చకపోతే అసంతృప్తి ఉండడం జరుగుతోంది.కానీ ఈసారి ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో దాదాపుగా 90శాతం తీవ్ర వ్యతిరేకత కనబరుస్తున్నారని, అందుకే పోస్టల్ బ్యాలెట్‌కుగిరాకీ, దానికోసం రద్దీ ఏర్పడిందని అంటున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లలో అత్యధిక శాతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పడ్డాయని చెప్తున్నారు. ఏలూరుజిల్లాలో15,320 మంది, పశ్చిమ గోదావరి జిల్లాలో 15,615 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కున్నారు. రాష్ట్రంలో మొత్తం 6 లక్షల మంది ఉద్యోగులకు గాను5 లక్షల 55 వేల మందికి పైగా వినియోగించుకున్నారని సమాచారం.

ఈ పరిస్థితులలో మొదటగా లెక్కించే పోస్టల్ బ్యాలెట్ నుండి అంతా ఏకపక్షమేనని ఎన్డీఏ నేతలు ప్రకటిస్తున్నారు. కానీ అధికార వైసిపితామేమళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని అంటున్నారు.ఈ పరిస్థితులలో ఈనెల నాలుగో తేదీ ఓట్ల లెక్కింపు జరిగే వరకు వేచి చూడాల్సిందే.

# ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ చర్యలు

- పటిష్ట భద్రత ఏర్పాట్లు
- స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలన



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా జూన్ 4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లాఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. శనివారం ఏలూరు సమీపంలో వట్లూరులోని సర్.సిఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను,కౌంటింగ్ కేంద్రాలను, భద్రతా చర్యలను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపుకోసం ఏర్పాట్లు అన్నీ ముందస్తుగానే పూర్తిచేయాలన్నారు.కౌంటింగ్ కేంద్రంలోకి అధికారులు, అభ్యర్ధులు,వారి ఏజెంట్లు వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు.ఓట్లలెక్కింపుకోసం చేపట్టవలసిన ఏర్పాట్లన్నీ సంబంధిత రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ హాలులోకి సెల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటివి అనుమతించబడవన్నారు. గుర్తింపు కార్డు లేకుండా ఎవరినీ అనుమతించరాదన్నారు.అనంతరం కంట్రోల్ రూమ్‌ను తనిఖీచేసి ఈవిఎంల భద్రతను పరిశీలించారు.సంబంధిత స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలన అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు.వీరి వెంటఉంగుటూరునియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్డిఓ ఎన్ఎస్ కె.ఖాజావలి, ఏలూరు ఆర్వో,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. ముక్కంటి,సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలే నా బలం - వారే నా బలహీనత

- మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్




**పెదవేగి,మేజర్ న్యూస్ :** కార్యకర్తలే నా బలం, వారే నా బలహీనత, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని దెందులూరు మాజీఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాల్షియంలో తనను కలిసిన కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి అనేది కార్యకర్తల కృషి,పట్టుదల మీద ఆధారపడి ఉంటుందన్నారు. గడచిన ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలతోపాటుగా కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిదని, వారి చేసిన కృషి ఫలితం మరో పదిరోజుల్లో తనను ఎమ్మెల్యేగా నిలబెడుతుందని ఆయన పేర్కొన్నారు. వారి కష్టాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటానని, వారికి ఏ కష్టం వచ్చినా ముందుండి ఆదుకుంటానని ఆయన తెలిపారు. ఎన్నికల రోజున కొప్పులవారిగూడెంలో టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యం చేయడమే కాక,తిరిగి వారిపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమన్నారు. వైసీపీ వర్గీయుడు దాడిచేస్తుండగా ఆత్మరక్షణకు అడ్డుకునే సమయంలో తగిలిన చిన్న గాయాన్ని బూతద్దంలో చూపించి, హత్యాయత్నం కేసు పెట్టడం శోచనీయమని ఆయన చెప్పారు. తొలుత సాధారణ వివాదం అని కేసుపెట్టిన పోలీసులు 41 నోటీసు ఇస్తామని స్టేషన్‌కు పిలిపించారని, స్టేషన్‌కు వెళ్ళిన తరువాత నీపై హత్యకేసు ఉంది. అరెస్టు చేస్తున్నామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు అధికార పక్షంతో అంటకాగిన అధికారుల్లో కొంతమంది ఇంకా వైసీపీ భజన చేస్తున్నారని. ఇది సరైన విదానం కాదని, ఇలాగే ఉంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రభాకార్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్,నంబూరి నాగరాజు,పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముసునూరు పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ



**ముసునూరు,మేజర్ న్యూస్:** ముసునూరు మండలం ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నూజివీడు డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ జాస్తి జగన్మోహన్రావు ఆకస్మికతనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను వైద్య అధికారిని అడిగి తెలుసుకున్నారు, వైద్య పరీక్షలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

## ఉప కారాగారాన్ని తనిఖీ చేసిన అదనపు సివిల్ జడ్జి



**నరసాపురం,మేజర్ న్యూస్:** అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)కె.శ్రీనివాసరావు స్థానిక ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా వంటశాలను ,ఆహార పదార్థాలను, జైల్ ప్రాంగణాన్ని పరిశీలించారు.ఉచిత న్యాయ సహాయం,లోక్ అదాలత్‌లపై అవగాహన కల్పించారు. బెయిల్ పై బయటకు వెళ్లిన వారు కేసు పూర్తి అయ్యేవరకు ప్రతీ వాయిదాకు హాజరు కావాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం ప్యానల్ న్యాయవాదులను ఉపయోగించుకోవాలన్నారు. జైల్ విజిటింగ్ లాయర్ శిరీష, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ చాముండేశ్వరి, పి.ఎల్.వి వరలక్ష్మి, ఉప కారాగారం పర్యవేక్షణ అధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యంత బాధ్యతతో ఓట్ల లెక్కింపు పక్రియ

### కౌంటింగ్ సూపర్వైజర్లు,సహాయకులకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశం




**భీమవరం,మేజర్ న్యూస్:** స్థానిక హోటల్ ఆనంద ఇన్ కాన్ఫరెన్స్ హాల్ నందు కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లుకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో శనివారం జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్,7 నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల నందు భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు, బివి రాజ్ కళాశాల నందు ఆచంట,పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈవీయంలో రిజల్ట్ మరల చూపించమని కోరిన సందర్భంలో మళ్లీ కచ్చితంగా చూపించాలని ఆదేశించారు. చిన్న పొరపాటుకు కూడా తావివ్వద్దని, ప్రతీఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని,కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు ఉదయం 6.00 లోపు కౌంటింగ్ సెంటర్‌లో రిపోర్ట్ చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు ఉదయం 7.00 గంటలకు తెరవబడతాయని, వెంటనే ఈవీఎంలను పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో తరలించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు ఉదయం 7.00 గంటలకు తమ తమ సీట్లలో కూర్చున్న తర్వాత, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎవరూ కౌంటింగ్ హాల్ నుండి బయటకు వెళ్లడానికి అనుమతించబడదన్నారు.ఈకార్యక్రమంలో 7 ఆసెంబ్లి నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు,కౌంటింగుసూపర్వైజర్లు,తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌లు తనిఖీ చేసిన జెసి బి.లావణ్య వేణి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను జాయింట్ కలెక్టర్,దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి శనివారం తనిఖీచేశారు. ఏలూరు లోని సర్. సి.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ స్ట్రాంగ్ వద్ద భద్రతను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతీరోజు స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను పరిశీలించవలసి ఉందన్నారు. ఈవీఎం లకు తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను, సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో జేసీ సంతకం చేశారు.

# గిరిజన భూముల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలు





### గిరిజన చట్టాలు ఎవరికి చుట్టాలు..? ఇష్టానుసారంగా ఇళ్ళ నిర్మాణాలు !

**వేలేరుపాడు,మేజర్ న్యూస్ :** ఏజెన్సీలోని మారుమూల మండల మైన వేలేరుపాడులో 1/70 చట్టం అమలులో ఉంది.ఇక్కడి గిరిజన భూమలను గిరిజనేతరులు క్రయ విక్రయాలు జరిపితే గిరిజన చట్ట ప్రకారం ప్రభుత్వ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన ప్రతీ ఏటా ముంపు ప్రాంతాలను గోదావరి వరదలు అతలాకుతలం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో పల్లపు ప్రాంత వాసులు మెరక ప్రాంతాలలో గృహాలు నిర్మించుకుం టున్నారు.ఈ ఇళ్ళ నిర్మాణంలో బాగంగా అత్యధిక శాతంగా రెవెన్యూ రికార్డులలో నమోదు అయిన గిరిజనుల భూములను కొనుగోలు చేసుకొని ఇళ్ళ నిర్మాణం చేపడుతున్న గిరిజనేతరులు ఏజెన్సీ చట్టాలను విస్మరిస్తున్నారు. సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్న చందంగా వీరి ఆగడాలను నియంత్రించడంలో రెవెన్యూ యత్రాంగం పూర్తిగా చేతు లెత్తేసిందనే విమర్శలు ఉన్నాయి. పలుకుబడి కల్గిన కొందరు వ్యక్తులతో చేయి కలిపిన గిరిజనేతరులు ఇష్టానుసారంగా ఇళ్ళ నిర్మాణం చేపట్టారు. గిరిజన భూములను కొనుగోలు చేసుకున్న పల్లపు ప్రాంతాల గిరిజనేతరులు మెరక ప్రాంతాలలోని భూదేవి పేట,బండ్ల బోరు చిన్న బుర్ర తోగు, శివకాశిపురం గ్రామాలలో పక్కా గృహాలు నిర్మించుకుంటున్నారు. ఒక్కో గృహానికి రూ.5 లక్షల నుండి సుమారు 30 లక్షల వరకు ఖర్చు చేసిన గిరిజ నేతరులు పక్కా ఇళ్ళు నిర్మించుకుంటున్నారు. ఈ ఇళ్ళ నిర్మాణ వ్యవహారం గత మూడేళ్ల నుండి కొనసాగుతోంది. మెరక ప్రాంతాల్లో ఇప్పటివరకు నూతన గృహా కట్టడాలు సుమారు 40 వరకు ఉన్నాయి. మరికొన్ని ఇళ్ళు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ గృహల నిర్మాణానికి అవసరమైన ఇసుక, రాయి,మట్టి సైతం మండలంలోని వాగులు, నదులు,గుట్టల నుండి సమకూర్చు కోవడంలో కొందరి అధికారుల పాత్ర ఉందనేది తెలుస్తోంది.ఎన్నికల సమయంలో ఇక్కడకు వచ్చిన తహశీల్దార్ ఎన్నికల అనంతరం సెలవుపై వెళ్లారు. ప్రభుత్వ నిభందనలకు వ్యతిరేకంగా ఇళ్ళ నిర్మాణం చేపడుతున్న విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బాదితులపై చర్యల కొరకు గతంలో 2022 నుండి ఇక్కడ విధులు నిర్వర్తించిన అధికారుల వివరాలను ఇప్పటికే సేకరించారు. మూడేళ్ల నుండి జరిగిన ఇళ్ళ నిర్మాణాలలో ఏ ఏ అధికారి పాత్ర ఉందనేది ఉన్నత అధికారులు విచారణ చేపట్టారు.1/70 చట్టానికి విరుద్ధంగా ఇళ్ళ నిర్మాణం జరుగుతూ ఉంటే ప్రేక్షక పాత్ర లో సంబధిత అధికారులు ఉన్నారనేది అర్థమవుతోంది.జిల్లా కలెక్టర్ తీసుకునే తదుపరి చర్యలపై అధికారులు,అక్రమ కట్టడాల యజమానులలో గుబులు మొదలైంది.

**ఏ ఒక్క ఫిర్యాదు తమ దృష్టికి రాలేదు –** ఇళ్ళ నిర్మాణంపై డిప్యూటీ తహశీల్దార్ పి.రమేష్ ను వివరణ కోరగా గిరిజనుల భూములు ఆక్రమణకు సంబందించి ఏఒక్క ఫిర్యాదు తమ దృష్టికి రాలేదని,ఇప్పటికే బండ్ల బోరు గ్రామంలో చర్యలు తీసుకున్నామని చెప్పారు. అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులకు (వీఆర్వో)ఆదేశాల ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఇసుక రవాణాపై పూర్తి నిఘా ఉంటుందని,ఎవరైనా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## మహిళ మృతి ఘటనపై విచారణకు గ్రామస్తుల ధర్నా





**కామవరపుకోట,మేజర్ న్యూస్:** కామవరపుకోట మండలం వీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన పాపమ్మ అనే మహిళ మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేయాలంటూ వీరిశెట్టి గూడెం వద్ద మృతదేహంతో పాపమ్మ కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. దినితో కిలోమీటర్ మేర స్తంభించిన ట్రాఫిక్. వీరిశెట్టిగూడెం గ్రామంలో దర్శనపు పాపమ్మని ఈ నెల 13వ తేదీన రాత్రి ఎవరో కొట్టి పడేసారని,ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందింది అని వీరిశెట్టిగూడెం గ్రామంఅడ్డరోడ్డులో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాస్తా రాకో చేశారు. తమకు న్యాయం కావాలి అని,కొట్టి చంపారో లేక ప్రమాదమో అనుమానం ఉంది అని,పోలీసులు తగిన నాయ్యం చేయాలనీ డిమాండ్ చేశారు.
రాస్తారోకో చేస్తున్న వారితో తడికలపూడి ఎస్సై జయబాబు మాట్లాడి ఆందోళనను విరమింప చేశారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడానికి విజ్ఞాన శిబిరాలు



**పెదవేగి,మేజర్ న్యూస్:** వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని పెదవేగి శాఖాగ్రంధాలయం గ్రంధపాలకుడు తోట అరుణ్కుమార్ ఉన్నారు.పెదవేగిలోనిశాఖాగ్రందాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం పలువురు విద్యార్థులు గండపఠనం చేశారు. ఈ సందర్భంగా గ్రంధపాలకుడు అరుణ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో గ్రంధపఠనం ఒక భాగం కావాలన్నారు. అప్పుడే ఆ విద్యార్థి ఉన్నతమైన జీవితాన్ని అందుకుంటారని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంధాలయ దర్శనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతంగా మార్చుతుందని ఆయన తెలిపారు.

## చినుకుపడితే చిత్తడి చిత్తడి



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** పొలమూరు, నాగల్లా దిబ్బ, చెన్నాడా చెరువు, బ్రాహ్మణ చెరువు, పొదలడ,రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి చినుకు పడితే రోడ్లుపై వాహనదారులు ప్రయాణించా లంటే వాహన దారులు ప్రమాదాలకు దారి తీస్తానని బెంబేలెత్తి పోతున్నారు. ప్రమాదాలు కారణం రోడ్ల పైన మట్టి పేరుకుపోవడంతో వాహనాలు జారే పడిపోతున్నారని వాహనదారుల గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. విచ్చలవిడిగా మట్టి తోలకలు జరగడంతో రోడ్లపై మట్టి పేరుకుపోవడంతో రహదారుల అద్వానంగా తయారయ్యాయని రోడ్ గోతులు మయమై సరిగా లేక ఒక పక్క బాధ పడుతుంటే రోడ్ పైన మట్టి చేరడంతో మరో ప్రమాదానికి చోటుచేసుకునే అవకాశం ఉందని వాహనదారులు గ్రామస్తులు అంటున్నారు.

# అంగన్వాడీ కేద్రంలో కిషోర బాలికల అవగాహనా సదస్సు



**అగిరిపల్లి,మేజర్న్యూస్ :** మండల పరిధి ఈదర గ్రామ అంగన్వాడీ కేద్రంలో శనివారం కిషోర బాలికల అవగాహనా సదస్సునిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఈదర సెక్టార్ సూపరవైజర్ జి.రాగమయి మాట్లాడుతూ గ్రామంలో 11సం.ల నుండి 18సం.ల వరకు బాలికలకు యుక్త వయసులో పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చునని తెలిపారు. అలాగే వివాహక మార్గనిర్దేశనం, యానిమేయా, ట్రాఫికింగ్, వ్యక్తిగత పరిశుభ్రత, మంచి మరియు చెడు సంబంధాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోఅంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలుతదితరులు పాల్గొన్నారు.

# వాసవి అమ్మవారిని దర్శించుకున్న ఆర్జెసి



**పెనుగొండ,మేజర్ న్యూస్:** పెనుగొండ పుణ్యక్షేత్రం నందు శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్ధిని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారినీ రీజనల్ జాయింట్ కమిషనర్ కె సుబ్బారావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నూలి తాతాజీ సాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపునకు కార్యోన్ముఖులు కండి





- అత్యంత పారదర్శకంగా,జవాబుదారీ తనంతో విధులు నిర్వహించాలి
- ఆత్మీయ సమ్మేళనంలో అధికారులను, సిబ్బందికి జిల్లా కలెక్టర్ అభినందనలు

ఏలూరు,మేజర్న్యూస్:ఎన్నికలనిర్వహణలోకీలకఘట్టమైనఓట్ల లెక్కింపు ప్రక్రియనుఅత్యంతపారదర్శకంగా,జవాబుదారితనంతో విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు కార్యోన్ముఖులు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శుక్రవారంరాత్రిస్థానిక కలెక్టర్ బంగ్లాలో ఎన్నికల విధుల్లో భాగస్వాములైన అధికార్ల అత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్మాట్లాడుతూఎన్నికలపోలింగ్ ప్రక్రియ నిర్వహణలో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించిన అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. దీని మూలంగా పోస్టల్ బ్యాలెట్ తో కలిపి 84.82 శాతం పోలింగ్ నమోదు అయిందన్నారు.విధి నిర్వహణలో ఉన్న అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడంవల్లనేఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఎన్నికల నిర్వహణలో పోలీస్ అధికారులు,సిబ్బందికి చక్కటి మార్గనిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతిని ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి తమ తరపున ధన్యవాదాలు తెలపాలని ఆయన ఎస్పీని కోరారు. అయితే ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకగా ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియను కూడా పోలింగ్ నిర్వహణలో చూపించిన స్పూర్తితో అత్యంత సమర్ధవంతంగా పూర్తిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీస్,జిల్లా పరిపాలనా యంత్రాంగం మంచి సమన్వయంతో పనిచేసినందునే పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో ముగిసిందన్నారు. ఇందుకు తమకు ఎంతో సహకరించిన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్కు జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి,అధనపు ఎస్పీ స్వరూపరాణి, సెబ్ జాయింట్ డైరెక్టర్ యన్. సూర్యచంద్రరావు,డిఆర్ఓ డి.పుష్పమణి,ఐటిడిఎ పివో యం.సూర్యతేజ,పలువురు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు,పలువురు డిఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

# పూడిక తొలగించండి

-ఇరిగేషన్ అధికారులను

కోరిన కూటమి అభ్యర్థి బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం,మేజర్న్యూస్:** వచ్చే వర్షాకాలంలో ఎర్ర కాలవ రైతులు ఇబ్బంది పడకుండా నందమూరి అక్విడెక్టు వద్ద పూడికను తొలగించాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను కోరారు. తాడేపల్లిగూడెం మండలం నందమూరి అక్విడెక్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్ద ఎత్తులో ఇసుకమేటలు వేసి అక్విడేట్ మొత్తం కూడికపోయే పరిస్థితిలో ఉంటే ఆ పనులు రైతుల చేసుకోవాలని చెప్పడం సమంజసం కాదని అధికారులకు నివేదించి వెంటనే ఈ పూడిక తీయించాలని కోరారు. రైతులకు తాను అండగా ఉంటానని పూడిక పనులకు సమయం లేనందున అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్తానని బొలిశెట్టి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందమూరు, శెట్టిపేట, మారంపల్లి ఆరుళ్ళ గ్రామాలకు చెందిన రైతులు నాయకులు పాల్గొన్నారు.

# అలరించిన ఘంటసాల నాటకం



**తాడేపల్లిగూడెం మేజర్ న్యూస్:** అమర గాయకులు, సంగీత దర్శకులు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత చరిత్రలోని ముఖ్యమైన ఘట్టాలతో,30 మంది అనుభవజ్ఞులైన రవి నాట్య మండలి సాయి సంతోషి నాట్యమండలి స్టేషన్ ఘన్పూర్ సురభి కళాకారులచే తాడేపల్లిగూడెం బి.వి. ఆర్ కళా కేంద్రంలో శనివారం రాత్రి ప్రదర్శించారు. సంగీత సాహిత్య అభిమానులు, ఘంటసాల భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని, నాటకాన్ని తిలకించి, ఆనందించారు. ఘంటసాల విజయనగరంలో సంగీతం నేర్చుకోవడానికి అడుగు పెట్టిన సంఘటన మొదలుకొని సంగీత పూర్తి చేయడం,హరికథ పితామహులు ఆదిభట్ల నారాయణకు దాసు నుంచి బహుమతి పొందడం, కళావర్ రింగు వారి సహాయ సహకారాలు అందుకోవడం, హిందుస్తానీ సంగీత విద్వాంసులు బడే గులాం అలీ ఖాన్ కి ఆశ్రయం కల్పించడం, కరుణ శ్రీ జాషువా ఇలాంటి ఉద్దండులైన పరిచయం, భగవద్గీత పారాయణం, మొదలకు అద్భుతమైనటువంటి సంఘటనల తో నాటకం బాగా రక్తి కట్టింది. 30 మంది అనుభవతులైన శ్రీ సాయి సంతోషి నాట్య మండలి కళాకారులు తమ నటనతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు ఈ నాటకానికి రచన దర్శకత్వం భాస్కరుని సత్య జగదీష్ నటీనటులు ఇంద్ర కుమార్ కొండలరావు, శర్మ, వెంకట్,హారిక, రామ లక్ష్మి,సుకన్య, రాయలు, సుధాకర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితులందరికీ ప్యాకేజీ ఇవ్వాలి

- ప్రభుత్వ వైఫల్యం వల్లే సీతారామయ్య ఆత్మహత్యాయత్నం

**ఏలూరు,మేజర్ న్యూస్:** పోలవరం నిర్వాసితుడు ఉండమట్ల సీతారామయ్య ఆత్మహత్యాయత్నం ఘటన పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. 73 ఏళ్ల వయస్సులో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ఎనిమిదేళ్లుగా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి మనస్థాపానికి గురైన సీతారామయ్య చేసేదిలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఉన్న భూమిని, ఇంటిని ప్రాజెక్టు కోసం అర్పించిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలకు కనీసం కనికరం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామయ్యలాంటి నిర్వాసితులుఇంకా చాలా మంది ఉన్నారన్నారు. నిర్వాసితులందరికీ ఇప్పటికైనా ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు మీద ఉన్న శ్రద్ధ పోలవరం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులపై లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితులను మాత్రం పట్టించుకోవట్లేదన్నారు. తక్షణం నిర్వాసితులందరికీ ప్యాకేజీ అందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ఆయన కోరారు.

## 27 న శాంతి నగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కోతలు

**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక డి3 - సెక్షన్ పరిధిలో ఉన్న 33/11కెవి శాంతి నగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11కెవి శాంతినగర్, విఐపి ఫీడర్ లకు చెట్లు కొమ్మలు కత్తిరించడం, లైన్లకు మరమ్మతు చేయుటకు 27 న సోమవారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు రిపేరు చేయబడును. శాంతి నగర్ స్టేషన్ పరిధిలో గల శాంతినగర్ ఏరియా, టిటిడి కళ్యాణ మండపం రోడ్,కల్లెక్టర్స్ బంగ్లా రోడ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జె.పి.బి నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా





**కైకలూరు మేజర్ న్యూస్:** ఏలూరు సబ్ డివిజన్ పరిధిలోని కైకలూరు రూరల్ పోలీసులు రామవరం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించి ఎటువంటి పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి గొడవలు అల్లర్లకు తావివ్వకుండా ప్రశాంతంగా జీవించాలని,అనవసరంగా కేసుల్లో చిక్కుకుని జీవితాలను చీకటిమయం చేసుకోవద్దని హెచ్చరించారు. అంతే కాకుండా ఉద్దేశపూర్వకంగా ఎవరైనా సమస్యలు సృష్టించిన, గొడవలను ప్రేరేపించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ సామరస్యంతో మెలగాలని గొడవలు లేకుండా ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ బి కృష్ణకుమార్, రూరల్ ఎస్ఐ టి.రామ కృష్ణ,పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం



**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్ :** మండలంలోని రాజుల లంక నడింపల్లి సత్యనారాయణ రాజు కొబ్బరి తోట ఎదురుగా గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు రూరల్ ఎస్ఐ గురవయ్య తెలిపారు. మృతునికి 45-50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, తెలుపు రంగు బనియను, నలుపు షార్ట్ ధరించి , నడుము చుట్టూ తెలుపు, ఎరుపు రంగులు కలిగిన టవల్ కట్టి ఉన్నట్లు ఆయన తెలిపారు. వివరాలకు రూరల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

## శాఖ గ్రంథాలయంలో యోగ మెడిటేషన్



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా శనివారం పిల్లల చేత పుస్తక పఠనం ,పత్రిక పఠనము చేయించడం,ఎలుక,పులి, నలుగురు స్నేహితులు కథలు వినిపించడం జరిగింది.సాఫ్ట్వేర్ ఇంజనీర్ ప్రిన్స్ ప్రవీణ్ తాడి గుడ్ కెరీర్ , స్కిల్ డెవలప్మెంట్ కమ్యూనికేషన్ స్కిల్స్ గురించి వివరించారు. శ్రీనివాస్ తెలుగు క్లాసులు యోగ ,మెడిటేషన్ సాధన చేయించడంకరాటే లో లోయర్ పంచ్ మిడిల్ పంచ్ అప్పర్ పంచ్ లో తమరపు కృష్ణ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులలోసూర్యం బాబు సుధీర్ మోహన్, సురేష్, పిల్లలు,తల్లిదండ్రు లు విద్యార్థులు పాల్గొన్నారు. అని గ్రేడ్ వన్ లైబ్రరియన్ కె జె ఎస్ ఎల్ కుమారి తెలిపారు.

## పిఎం కౌశల్ వికాస్ యోజన సర్టిఫికెట్ ప్రదానోత్సవం



**అగిరిపల్లి,మేజర్ న్యూస్:** మండల పరిధి గోపాలపురం గ్రామంలో గల ఎన్నారై ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన సర్టిఫికెట్ ప్రధానోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ రవి వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్ సి ఎల్ కంపెనీ హెచ్ఆర్ డి. బాలచక్రధర్ విచ్చేసి సర్టిఫికెట్ ప్రధానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా 'సి.నాగ భాస్కర్, అకాడమిక్ డైరెక్టర్ డా 'జి. సాంబశివరావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ డా' జి. ఆదిలక్ష్మి, ముఖ్య సలహాదారులు డా'ఎం. ఎన్.వి.సురేంద్ర, సిహెచ్ వి మురళీకృష్ణ, ప్రాజెక్ట్ టెక్నికల్ ఇంచార్జ్ ఎం ఎం ఎస్ ప్రసాద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఈ స్కిల్ కార్యక్రమం గురించి అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేశారు.

## పేకాట శిబిరంపై దాడి

- నలుగురు పై కేసు

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై పోలీసుల దాడిచే 4 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1560 నగదు,4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.చంద్ర శేఖర్ తెలిపారు.

# దివ్యాంగ విద్యార్ధులకు అందుబాటులో వసతి గృహాలు

- 3వ తరగతి నుండి

పి.జి.స్థాయి విద్య వరకు అవకాశం

**ఏలూరు,మేజర్న్యూస్:** దివ్యాంగులైన శారీరక వైకల్యము, దృష్టి లోపం,మూగ, చెవుడు (బధిరులు) మొదలైన వారు 3వ తరగతి నుండి పి.జి.స్థాయి వరకు చదువు తున్నవారికిఏలూరుపట్టణంనందు కోటదిబ్బ ప్రాంతములోబాల,బాలికలకువిడివిడిగాప్రత్యేకవసతి గృహాలుఅందు బాటులో ఉన్నాయని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి పి.రాకడ మణి తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఐ.టి.ఐ.పాలిటెక్నిక్ లేదా ఇంటర్ నందు చేరువారు,ఇంటర్ ఉత్తీర్ణులై డిగ్రీ నందు చేరువారు లేదా డిగ్రీ పాసై పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులలో ప్రవేశాలు పొందగోరు విభిన్న ప్రతిభావంతులు ఈ వసతి గృహాలలో వసతి పొంది విద్యను అభ్యసించ వచ్చున్నారు. ఒక్క సారి 3వ తరగతి నందు ప్రవేశము పొందిన వారు వారి వసతికై వేరు వేరు ప్రాంతాలకు వెళ్ళ వలసిన అవసరము లేకుండా పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు వారి చదువు కొనసాగించు కోవచ్చున్నారు. ఈ వసతి గృహములలో ప్రవేశము పొందిన వారికి ఉచిత భోజన వసతితో పాటు నాలుగు జతల దుస్తులు, దుప్పట్లు, ట్రంకు పెట్టి,నోటుపుస్తకాలు,ప్రతిరోజుకోడి గ్రుడ్డు,వారములో రెండు,మూడు రోజులు చికెన్ తో భోజనము మొదలగు సదుపాయాలు ఉన్నాయన్నారు. కాస్మెటిక్ చార్జెస్ క్రింద 3వ తరగతి నుండి 6వ తరగతి వరకు విద్యను అభ్యసించే అబ్బాయిలకు నెలకు రూ.175 లు అమ్మాయిలకు రూ.130 లు చెల్లింపు,7వ తరగతి నుండి ఆపై విద్యను అభ్యసించే అబ్బాయిలకు నెలకు రూ.200 లు అమ్మాయిలకు రు.200 లు చెల్లించ బడుచున్నది. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకై ప్రత్యేకముగా స్టాఫ్ నర్సులు ఉన్నారన్నారు. కావున, జిల్లాలోని దివ్యాంగులైన విద్యార్ధులు ఈ చక్కటి అవకాశము ఉపయోగించు కోవలసినదిగా తెలియ పరుస్తూ వివరాలకు 8142938379 లేదా 9394004882 నకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చున్నారు. తల్లి,తండ్రులు వారి పిల్లలతో వచ్చి నేరుగా వసతి గృహాలను సందర్శించవచ్చని రాకడ మణి కోరారు.

# 150 సీట్లకు పైగా ఎన్డిఎ కూటమి విజయం ఖాయం

- 'దేశం' నేత కాపా శ్రీనివాసరావు



**నూజివీడు,మేజర్ న్యూస్:** రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం,బిజెపి,జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులు 150 సీట్లు పైగా విజయం సాధిస్తారని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు,వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,రావిచెర్ల గ్రామ సర్పంచ్ కాపా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టనున్నదని ధీమా వ్యక్తం చేశారు. శనివారం తన కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి 150 సీట్లకు పైగా వస్తాయన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి జీవనాడిగా పేర్కొంటున్న పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతోపాటు రాష్ట్ర రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. అలాగే మెట్ట ప్రాంతమైన నూజివీడుకు సాగునీటి వనరులు అందించేందుకు వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అలాగే 13వ తేదీ జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి తెలుగుదేశం పార్టీకి ఓటు వేసినరాష్ట్ర ప్రజానీకానికి, తెలుగుదేశం గెలుపు కోసం ఇతర రాష్ట్రాలు ఇతర దేశాల నుంచి వచ్చి కృషి చేసిన ఉద్యోగులకు,వ్యాపారులకు ఆయనకృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ విజయం కోసం నారా లోకేష్ ఇవ్వగలం పాదయాత్ర చేపట్టారని,పార్టీ విజయం కోసం నారా కుటుంబం అంతా ఎంతో కష్టపడ్డారని ఆయన వివరించారు. నూజివీడు నియోజకవర్గంలో టిడిపి ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని కాపా శ్రీనివాసరావు స్పష్టం చేశారు

# కౌంటింగ్ సిబ్బందికి తొలి విడత ర్యాండమైజేషన్



**భీమవరం,మేజర్ న్యూస్:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో జూన్ 04వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ చాంబర్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య,జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఎన్.ఐ.సి. అధికారులతో కలిసి శుక్రవారం తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

నరసాపురం పార్లమెంట్,అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు, పర్యవేక్షించేందుకు గాను కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు కలిపి 859 మంది అవసరం కాగా రిజర్వ్ సిబ్బందిని కూడా కేటాయిస్తూ మొత్తం 955 మందికి సంబంధించి ర్యాండమైజేషన్ నిర్వహించారు. వారిలో కౌంటింగ్ సూపర్ వైజర్లు 292 మంది ఉండగా, కౌంటింగ్ అసిస్టెంట్లు 346 మంది, మైక్రో అబ్జర్వర్లు 317 మంది ఉన్నారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకారం



**చింతలపూడి,మేజర్ న్యూస్:** ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఏలూరు టైమ్స్ సీనియర్ జర్నలిస్ట్ అశోకవర్ధన్ మృతికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజాశక్తి రిపోర్టర్ అశోక్ వర్ధన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించమని కోరగానే ఎంతోమంది సహృదయంతో తమ వంతు సహాయం అందించారు. వారందరి తరఫున రూ.33,100లు అశోక్ వర్ధన్ కుటుంబానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. జనసేన పార్టీ మండల పార్టీ ప్రెసిడెంట్ చిదరాల మధు బాబు, నాయకులు, కార్యకర్తలు తమ వంతు సహాయంగా రూ.11 వేలు అందించడం జరిగింది. అశోక్ వర్ధన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా రాబోయే రోజుల్లో వారికి ఎలాంటి సమస్య వచ్చిన మేమున్నామంటూ వారికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు భరోసా ఇచ్చారు.